## మండల నాయకులతో సమావేశమైన ఎమ్మెల్యే కేతిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

**యాడికి, ఆగస్టు 20 ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని వైకాపా కార్యాలయంలో ఆదివారం ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి మండల వైకాపా నాయకులతో సమావేశమయ్యారు. ఈ నెల 22వతేదీ నుండి యాడికి మండలంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి చేపట్టనున్న పాదయాత్ర గురించి సమావేశంలో చర్చించారు. 22న మండలంలోని గుడిపాడు నుండి పాదయాత్ర ప్రారంభమై ఈ నెల 28వతేదీ వరకు కొనసాగుతుందన్నారు. యాడికిలో భారీ బహిరంగసభ నిర్వహించిన అనంతరం ఈ పాదయాత్ర ముగుస్తుందని వైకాపా నాయకులు తెలిపారు. ఈ కార్య క్రమంలో మండల కన్వీనర్ బొంబాయి రమేష్‌నాయుడు, మాజీ జెడ్‌పిటిసి వెంకటరామిరెడ్డి, బాలా రమేష్‌బాబు, కాసా చంద్రమోహన్, నాగరాజు, రామమోహన్, తలారి నాగేష్, రషీదు, తిప్పారెడ్డిపల్లి రామాంజులరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## మహాసభను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎంఆర్‌పిఎస్ నాయకులు

**పెద్దపప్పూరు, ఆగస్టు 20 ప్రభాతవార్త**

ఎస్‌సి రిజర్వేషన్ల వర్గీకరణ సాధనకై మాదిగల హలో మాదిగ చలో హైదరాబాద్ విశ్వరూప మహాసభకు లక్షలాది మంది తరలివచ్చి విజయవంతం చేయాలని ఎంఎస్‌పి జాతీయ నాయకులు, అనంతపురం జిల్లా ఇన్‌చార్జ్ గుండాల ఈశ్వరయ్య పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఎస్‌సి కాలనీ ఆర్డీటి స్కూల్‌లో ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి ముఖ్యనాయకుల సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మందకృష్ణమాదిగ నాయకత్వంలో తలపెట్టిన ఎస్‌సి రిజర్వేషన్ వర్గీకరణ సాధనకై మాదిగల హలో మాదిగ చలో హైదరాబాద్ విశ్వరూప మహాసభకు మండలంలోని ప్రతి గ్రామం నుండి పెద్దఎత్తున మాదిగలు తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సభాధ్యక్షులు కంబగిరి, ఎంఆర్‌పిఎస్ మండల అధ్యక్షులు ఆదినారాయణ, ఎంఎస్‌పి రాష్ట్ర నాయకులు పెద్దిరాజు, ఎంఎస్‌పి తాడిపత్రి నియోజకవర్గం ఇన్‌చార్జ్ కదిరప్ప, ఎంఎస్‌పి అనంతపురం జిల్లా కో కన్వీనర్ వాసు, రాజశేఖర్, వెంకటేష్, రంగనాయకులు, పుల్లయ్య, చంద్రశేఖర్, శంకర్, జైకృష్ణ పాల్గొన్నారు.

## బస్సు యాత్రను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న చింతా పురుషోత్తం

**పెద్దపప్పూరు, ఆగస్టు 20 ప్రభాతవార్త**

ఈ నెల 17వవతేదీ నుండి సెప్టెంబర్ 8వతేదీ వరకు చేపట్టనున్న సిపిఐ బస్సు యాత్రను విజయవంతం చేయాలని సిపిఐ మండల కార్యదర్శి చింతా పురుషోత్తం పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలతో ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. పాలకుల నుండి దేశాన్ని కాపాడాలని రాష్ట్రాన్ని రక్షించాలన్నారు. దేశవ్యాప్తంగా మతోన్మాదంతో మైనార్టీలు మహిళలు, రచయితలు, మేధావులు, దళితులు, గిరిజనులపై అనేక దాడులు జరిగాయన్నారు. దేశంలో రైతులు, కార్మికులకు భద్రత లేని నల్ల చట్టాలను తీసుకొచ్చి అన్నం పెట్టే రైతులు, కార్మికుల పట్ల తీరని ద్రోహానికి పాలకులు పాల్పడుతున్నారన్నారు. దేశంలో సామాన్య ప్రజలు బతకలేని విధంగా నిత్యావసరసరుకుల ధరలు పెంచేసి డీజిల్, పెట్రోల్, గ్యాస్ ధరలు పెంచి ప్రజలపై భారం మోపారని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా, ఉత్తరాంధ్ర రాయలసీమ వెనుకబడిన ప్రాంతాలకు ప్యాకేజి ప్యాకేజి మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 17న జరిగే బస్సు యాత్రకు పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు, కార్మికులు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి రామకృష్ణ, అభి, నారాయణస్వామి, ఎపి చేనేత కార్మిక సంఘం మండల గౌరవాధ్యక్షులు చింతా ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా నాగులచవితి వేడుకలు

**యల్లనూరు, ఆగస్టు 20 ప్రభాతవార్త**



నాగపడిగలకు పాలు పోస్తున్న భక్తులు

మండల కేంద్రంలో ఆదివారం నాగులచవితి పండుగను ఘనంగా జరుపుకున్నారు. ప్రజలు మండల కేంద్రంలోని కోడు మూర్తి వెళ్లే దారిలో వున్న నాగపడిగల వద్దకు వెళ్లి పాలు పోసి, చలివిండి, నూగులపిండి, పెసరబేడలు, కొత్తచీరలు పెట్టి, నూలుపోగు పుట్టలు, నాగులకు చుట్టి దూదితో చేసిన వత్తులతో హారాలు చేసి వాటిని సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. దీంతో ఆలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి.

## లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

**తాడిపత్రిఅర్బన్, ఆగస్టు 20 ప్రభాతవార్త**

తాడిపత్రి పట్టణంలోని శ్రీనివాసపురంలో వున్న శ్రీశివకృష్ణసాయి వృద్ధాశ్రమంలో ఆదివారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా దాదాపు 105 మందికి జేస్వి ఆసుపత్రి డాక్టర్ మధుఅశోక్, డాక్టర్ సాయికిరణ్‌రెడ్డి, డాక్టర్ వసుంధర, మెడికల్ సిబ్బంది బిపి, షుగర్, తదితర వైద్యపరీక్షలు నిర్వహించి వారికి మందులు పంపిణీ చేశారు. ఈ కార్య క్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షులు చంద్రశేఖర్‌రెడ్డి, నాగవాణి, అనురాధ, నాగేశ్వర్‌రెడ్డి, హరిత, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా నాగులచవితి వేడుకలు



పుట్ట వద్ద పాలు పోస్తున్న భక్తులు

**తాడిపత్రిఅర్బన్, ఆగస్టు 20 ప్రభాతవార్త**

తాడిపత్రి పట్టణంలో ఆదివారం నాగులచవితి పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఉదయాన్నే తలస్నానాలు చేసి ఉపవాసం వుంటూ సమీపంలోని పుట్టలు, నాగులకట్ట వద్దకు వెళ్లి పాలుపోసి, చలివిండి, నూగులపిండి, పెసరబేడలు, కొత్తచీరలు పెట్టి, నూలుపోగు పుట్టలు, నాగులకు చుట్టి దూదితో చేసిన వత్తులతో హారాలు చేసి వాటిని సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల రద్దీతో పట్టణ సమీపంలోని పుట్టలు, పట్టణంలోని శ్రీచింతల వేంకటరమణస్వామి, శ్రీబుగ్గరామలింగేశ్వరస్వామి, శ్రీమార్కండేయస్వామి, శ్రీసత్యనారాయణస్వామి, నాగులకట్ట, శ్రీఅయ్యప్పస్వామి ఆలయం, కడప రోడ్డులోని రాములుగుడి, బ్రహ్మంగారి గుడి, శ్రీఅక్కమహాదేవతల గుడి, టైలర్స్ కాలనీ సమీపంలోని పుట్ట వద్ద పూజలు చేశారు. అదేవిధంగా ఆలయాల వద్ద వున్న నాగులకట్టలు భక్తులతో పోటెత్తాయి. నాగులచవితి రోజు ఉపవాసం వుంటూ భక్తిశ్రద్దలతో నాగమ్మతల్లిని కొలిస్తే తాము కోరుకున్న కోర్కెలతో పాటు అన్నివిధాల శుభప్రదంగా వుంటుందని భక్తుల విశ్వాసం. సోమవారం నాగపంచమి రోజు ఉపవాసం దీక్షను విరమించి పిండివంటలు వేసుకుని నైవేద్యం పెట్టి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అనంతరం బంధువులు, స్నేహితులతో విందు ఆరగించనున్నారు. పట్టణంతో పాటు పరిసర గ్రామాల్లో కూడా నాగులచవితి పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఇళ్ల ముందు కల్లాపిచల్లి వివిధ రకాల రంగవల్లులు వేసి వీధులను సరా ్వంగా సుందరంగా తీర్చిదిద్దారు.

## ఘనంగా రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలు



రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్‌పార్టీ నాయకులు

**కదిరి, ఆగస్టు 20 ప్రభాతవార్త**

మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ 79వ జయంతి వేడుకలను ఆదివారం పట్టణంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ సమన్వయ కర్తలు పిఎస్ అహ్మద్ హుస్సేన్ ఇనాయతుల్లా ఖాన్, మహ్మద్ రఫి, మునికుమార్, తిరుపాల్, శ్రీరాములు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల సంక్షేమ పథకాలను కొనసాగించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లాప్రధాన కార్యదర్శి వెంకటేష్

**కదిరి, ఆగస్టు 20 ప్రభాతవార్త**

నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలను కొనసాగించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్ తెలిపారు. ఆదివారం పట్టణంలోని ఎన్‌జిఓ హోంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు రామకృష్ణ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ.. జీవో నెంబర్ 17ను రద్దు చేసి నిబంధనలకు విరుద్దంగా తరలించిన సంక్షేమ బోర్డు నిధులను తిరిగి జమా చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలోనాయకులు సురేంద్రచౌదరి, సాంబశివ, అహ్మద్‌హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యునిగా మాజీ మంత్రి రఘువీరారెడ్డి ఎంపిక పట్ల హర్షం

**గుడిబండ, ఆగస్టు 20 ప్రభాతవార్త**

జాతీయ కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యులుగా మాజీ మంత్రి రఘువీరారెడ్డి ఎంపిక హర్షనీయమని సత్యసాయి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు కరికెర సుధాకర్ తెలిపారు. ఆదివారం తన నివాసంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. జాతీయ కాంగ్రెస్ పార్టీ కమిటీలో రఘువీరారెడ్డికి చోటు దక్కడం శుభ పరిణామమన్నారు. ఈ నేపథ్యంలో ఏపిలో పార్టీ బలోపేతానికి ఇది ఎంతగానో దోహదపడుతుందని ఆయన ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఏఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే నేతృత్వంలో జరిగిన సిడబ్ల్యూసి నియామకంలో దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన 30 మంది జాబితాలో సోనియా గాంధీ, రాహుల్‌గాంధీ, మన్మోహన్‌సింగ్, తదితరులతోపాటు ఉమ్మడి తెలుగు రాష్ట్రాల నుంచి రఘువీరారెడ్డికి అవకాశం దక్కడం ఎంతో అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని పార్టీ మండల కన్వీనర్లు టివిఎస్ మంజునాథ్, మందలపల్లి నాగరాజు, లోకేష్ నాయకులు డాక్టర్ రవిశంకర్, సురంగాల నాగరాజు, శివ, వరదరాజు, మల్లికార్జున, నారాయణప్ప తదితరులు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆంజినేయస్వామి దేవాలయం హుండీ లెక్కింపు



హుండీ డబ్బులు లెక్కిస్తున్న దృశ్యం

**గుడిబండ, ఆగస్టు 20 ప్రభాతవార్త**

గుడిబండ మండల పరిధిలోని కొంకల్లు గ్రామ పరిధిలో వెలసిన శ్రీ ఆంజినేయస్వామి దేవాలయం హుండీని ఆదివారం గ్రామ పెద్దలు లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. భక్తుల నుంచి 19,500 రూపాయలు వచ్చిందని ఇందులో 850 చెల్లుబాటు కానీ పాత నోట్లురావడం జరిగిందని మిగిలిన మొత్తం 18650 వచ్చిందని ఈ మొత్తం దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గుడిబండ ఎంపిడిఓ రామారావు, కేఎం రాజ్‌కుమార్, సొసైటీ భోజన్న, నంజన్న, గ్రామస్తులు శివకుమార్, డీలర్ రామాంజినేయులు, రమేష్, మహాలింగప్ప తదితరులు పాల్గొన్నారు.

# బడుగువర్గాల ప్రజలకు బాసటగా నిలిచిన గొప్పవ్యక్తి దేవరాజ అరసు

### - మాజీ సీఎం దేవరాజ అరసు జయంతి కార్యక్రమంలో జిల్లాధికారి ప్రశాంత్‌కుమార్ మిశ్రా



మాట్లాడుతున్న జిల్లాధికారి ప్రశాంత్‌కుమార్ మిశ్రా

**బళ్లారి, ఆగస్టు20, ప్రభాతవార్త**

సామాజికన్యాయం రూపకర్త, వెనకబడిన వర్గాల ఆశాజీవి, మాజీ ముఖ్యమంత్రి దివంగత దేవరాజ అరసు పేద ప్రజలపాలిట, అట్టడుగు వర్గాల కుటుంబాల ఆశాజీవిగా ఉన్నారని, ముఖ్యమంత్రిగా ఆయన చేపట్టిన అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలు, ప్రగతిపర యోజనలు నేటికీ ప్రభుత్వాలకు ఆదర్శంగా నిలిచాయని, ఆయనను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లాధికారి ప్రశాంత్‌కుమార్ మిశ్రా అభిప్రాయం వ్యక్తం చేశారు. జిల్లా యంత్రాంగం, జిల్లా పంచాయతీ, వెనకబడిన వర్గాల సంక్షేమశాఖ సంయుక్తాధ్వర్యంలో ఆదివారం నాడు నగరంలోని బీడీఏఏ ఫుడ్‌మాల్ మైదానం సభాభవనంలో నిర్వహించిన దివంగత దేవరాజఅరసు 108వ జయంతి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. వెనకబడినవర్గాల సంక్షేమం కోసం వారి ఆర్థిక, సామాజిక, శైక్షణిక అభివృద్ధి కోసం పాటుపడిన ధీశాలి అని సామాజిక పరివర్తనకు నిరంతరం శ్రమించిన మహానాయుడిగా చరిత్ర పుటల్లో ఎక్కారని వెల్లడించారు. భూసవరణ చట్టం, వెనకబడిన వర్గాల అభివృద్ధికై రూపొందించిన అనేక యోజనలు, మైసూరు రాష్ట్రాన్ని కర్ణాటక రాష్ట్రంగా అవతరణ చేయడంతోపాటు అనేక విశిష్ట, పరిణామకర యోజనలు తీసుకురావడంతో దేశంలో ఉత్తమ ముఖ్యమంత్రిగా ప్రజల జనప్రియ రాష్ట్రనేతగా ఖ్యాతి పొందారన్నారు. నిరుపేద కుటుంబాలకు చెందిన పిల్లల విద్యాభ్యాసం కొరకు వసతిగృహాల స్థాపనలో మహత్తరమైన నిర్ణయాలు తీసుకొని ఆచరణలోకి తీసుకొచ్చారని, సమాజానికి దేవరాజ అరసు అందించిన కానుకలు అపారమైనవని, ఇటువంటి ఆదర్శ వ్యక్తులు మనకు, భావితరాలకు స్పూర్తిగా తీసుకోవాల్సిన ఆవశ్యకత ఉన్నదన్నారు. జిల్లా పంచాయతీ సీఈఓ రాహుల్‌శరణప్ప సంకనూరు మాట్లాడుతూ దేవరాజ అరసు భూసవరణ చట్టం, కేంద్ర ప్రభుత్వపు 20 అంశాల యోజన, మహాత్మా గాంధీజీ సిద్ధాంతంగా ఉన్న దున్నేవాడిది భూమి అనే పరికల్పనను జారీలోకి తీసుకొచ్చారని, కూలీ కోసం కష్టించే భూరహిత కార్మికులకు భూమిని సాగుచేసుకునేందుకు కేటాయించిన మహావ్యక్తి ఆయన అని చెప్పారు. ఈ సందర్భంలో కర్ణాటక ప్రదేశ్ దేవరాజ అరసు వేదిక అధ్యక్షుడు కల్లుకంబ పంపాపతి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నగరపాలికె మేయర్ డి.త్రివేణి అధ్యక్షత వహించారు. ఇదే సందర్భంలో బెళగావి ఇంజనీరింగ్ కాలేజీలో ఏడు బంగారు పతకాలను సాధించిన బళ్లారి విద్యార్థి సంపత్‌కుమార్‌ను వేదికపై అతిథులు సత్కరించి సన్మానం జరిపారు. ఇదే సందర్భంలో వెనకబడిన వర్గాల సంక్షేమశాఖ నుంచి వసతిగృహాల్లో ఉన్న ర్యాంకు మార్కులు సాధించిన విజేతలైన విద్యార్థులకు బహు మతులు, ప్రశస్తిల ప్రదానం జరిగింది. ఉప మేయర్ జానకి, మాజీ మేయర్ ఎం.రాజేశ్వరి, బీసీఎం జిల్లాధికారి ఎస్ఆర్ సురేష్ బాబు, జిల్లా ఎన్‌జీవోల సంఘం అధ్యక్షుడు ఎం.శివాజీరావు, కొట్రప్ప, వెనకబడిన వర్గాల వివిధ సంఘసంస్థల అధ్యక్షులు, పదాధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఈనెల 22న పాదయాత్ర... 24న ఆర్‌డిఓ కార్యాలయం ముట్టడి

### - సిపిఎం పార్టీ



విలేఖరుల సమావేశంలో సిపిఎం పార్టీ శ్రేణులు,

**గుంతకల్లు, ఆగస్టు 20 ప్రభాతవార్త**

ఈ నెల 22వ తేదీన రాగులపాడు గ్రామంలోని తూము వద్ద నుండి పాదయాత్రతో పాటు 24వ తేదీన ఆర్‌డిఓ కార్యాలయం ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సిపిఎం పార్టీ శ్రేణులు పేర్కొన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో విలేఖరుల సమావేశంలో పార్్టీ పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు మాట్లాడుతూ...

నాడు ఉరవకొండ నియోజకవర్గంలోని రాగులపాడు తూము నుండి రూ.49కోట్లు వ్యయం చేస్తూ పిల్లకాలువలు ఏర్పాటుతో గుంతకల్లు మండల గ్రామీణ ప్రాంతాలకు త్రాగు, సాగు నీటిని అందించాలని సంకల్పించడంను తమ పార్టీ స్వాగతించిందన్నారు. కాని గతం నుండి ప్రస్తుతం వరకు అధికారులు, ప్రజాప్రతినిధులు సైతం అనేకమార్లుగా హామీలతో కాలయాపన సాగిస్తున్న తీరు భాధాకరమని, కాలం గడుస్తున్నా వారి ప్రయత్నాలలో ఎలాంటి మార్పులు లేకపోగా ఛోద్యం చూస్తున్న తీరు శోచనీయమన్నారు. వారి అలసత్వంతో కూడిన నిర్లక్ష్యంపై తమ పార్టీ రైతుల పక్షాన పోరాటాలకు సిద్ధపడుతూ ఈనెల 22వ తేదీన పాదయాత్రకు శ్రీకారం చుట్టామని, 24వ తేదీన మండలంలోని రైతుల సమీకరణతో గుంతకల్లు ఆర్‌డిఓ కార్యాలయం ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. సదరు కార్యక్రమంలో జిల్లా శ్రేణులు కూడా పాల్గొంటున్నారని,

ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున మండల రైతులు హాజరై కార్యక్రమంను విజయవంతం చేయాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో దాసరి శ్రీనివాసులు, మారుతిప్రసాద్, సాకే నాగరాజు, రమేష్, మల్లి, ఓబులయ్య, సూరి తదితర నాయకులు పాల్గొన్నారు.

## బైక్‌పై అదుపుతప్పి తీవ్రంగా గాయపడ్డ ఓ గర్భిణి



ద్విచక్రవాహనంలో ప్రయాణిస్తూ గాయపడిన గర్భిణి అనూష.

**గుంతకల్లు, ఆగస్టు 20 ప్రభాతవార్త**

వాహనాల ప్రయాణాలలో అప్రమత్తత అవశ్యమని, ఏ చిన్న పొరబాటుకు తావిచ్చిన ప్రమాదంకు తావిస్తుందన్న నగ్నసత్యంకు ఓ మచ్చుతునకగా ద్విచక్రవాహనంలో ఓ దంపతులు తమ యేడాదిన్నర చిన్నారితో ప్రయాణిస్తూ ఓ మహిళ (5మాసాల గర్భిణి) ప్రమాదవశాత్తు కిందపడి తీవ్రంగా గాయపడిన సంఘటన ఆదివారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. సదరు ప్రమాద సంఘటనకు సంబందించి భాధితుల బంధువుల కథనం మేరకు... కర్నూలు జిల్లా పత్తికొండ మండలం చక్రాల గ్రామంకు చెందిన ధనుంజయ, అనూష దంపతులు గుంతకల్లు మండలపరిధిలోని మొలకలపెంట గ్రామం నుండి గుంతకల్లు పట్టణంలో వైద్య పరీక్షల నిమిత్తం వచ్చారన్నారు.

గుంతకల్లు పట్టణంలోని ఓ వైద్యశాలలో పరీక్షల నిర్వహణ అనంతరం తమ స్వగ్రామంకు తమ ద్విచక్రవాహనంలో బయలుదేరారు. కాగా గుంతకల్లు - మద్దికెర రోడ్డుమార్గంలోని ఓ గోదాము సమీపంలో ప్రమాదవశాత్తు ద్విచక్రవాహన చక్రంలో చీర చుట్టుకోవడంతో కిందపడి తీవ్రంగా గాయపడింది. దీంతో ఆమె అపస్మారకస్థితిలో ఉండగా భర్త వెంటనే 108కు సమాచారం అందించడంతో హుటాహుటిన 108వాహన ం ద్వారా గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కాగా గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్సల అనంతరం మెరుగైన వైద్యసేవలు అవశ్యమని వైద్యసిబ్బంది అనంతపురము జిల్లా కేంద్రం ఆసుపత్రికి రెఫర్ చేయడంతో 108వాహనం ద్వారా తరలించారు. ఈ సంఘటనపై ఆసుపత్రి వైద్యసిబ్బంది గుంతకల్లు టూటౌన్ పోలీసులకు సమాచారం అందించారు.

## సిరుగుప్ప పోలీసులచే అక్రమ గంజాయి విక్రేతల పట్టివేత

### - రూ.27,820 గంజాయి ప్యాకెట్లు స్వాధీనం



సిరుగుప్ప పోలీసులు అక్రమ గంజాయిని తరలిస్తున్న ముఠాను పట్టుకొని స్వాధీనపరుచుకున్న గంజాయి ప్యాకెట్లను ప్రదర్శిస్తున్నప్పటి దృశ్యం

**బళ్లారి, ఆగస్టు 20, ప్రభాతవార్త**

జిల్లాలోని సిరుగుప్ప పోలీస్‌స్టేషన్ పోలీసులు జరిపిన ముమ్మర దాడులు నిర్వహించి నలుగురు నిందితుల్ని అదుపులోకి తీసుకొని వారు అక్రమంగా మత్తు పదార్థాలైన గంజాయిని విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకొని అరెస్టు చేశారు. వారి నుంచి సుమారు రూ.27,820 విలువైన గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ రంజిత్‌కుమార్‌బండారు తెలిపారు. ఈ కేసులో నిందితులైన గుంతకల్‌కు చెందిన అంజి(19), సిరుగుప్పకు చెందిన దివాకర్(22), సిరుగుప్పకు చెందిన హర్ష(19), హుడేగోళకు చెందిన విశ్వనాథ్(19)లను అత్యంత చాకచక్యంగా పట్టుకొని కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఈ కార్యాచరణలో సిరుగుప్ప డీయస్పీ నటరాజ నేతృత్వంలో పోలీసు అధికారులు వెంకటేష్, సీఐ సుందరేష్, పీఎస్ఐ తిమ్మన్న, హొన్నప్ప, సిబ్బంది రసూల్‌సాబ్, ఈరన్న, ద్యామన్నగౌడ, విజయ్‌నింగన్నవర్, వి.బసవరాజ, విష్ణుమోహన్‌లు పాల్గొని నిందితుల్ని అరెస్టు చేసినట్లు, వారికి రివార్డు ప్రకటిస్తున్నట్లు జిల్లా ఎస్పీ తెలిపారు.

## భారత చైతన్య యువజన పార్టీ సమావేశానికి హాజరైన రామ్మోహన్ యాదవ్



సమావేశానికి హాజరైనవారిని సత్కరిస్తున్న దృశ్యం

**అనంతపురం రూరల్, ఆగస్టు 20, ప్రభాతవార్త**

విజయవాడలో జరిగిన భారత చైతన్య యువజన పార్టీ సమావేశానికి అనంతపురం జిల్లా తరపున రామ్మోహన్ యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభలో పార్టీ తనకిచ్చిన అవకాశాన్ని పార్టీని ప్రజల్లో విస్తృతంగా తీసుకెళ్ళి గ్రామస్థాయి నుండి జిల్లాస్థాయి వరకు బలోపేతం చేస్తానని, బీసీవై పార్టీ మేనిఫేస్టోను ప్రజల్లోకి తీసుకెళ్ళి విద్యా, వైద్యం, ఉపాధి రైతులు, కర్షకులు, యువత, మహిళలు పడుతున్నటువంటి ఇబ్బందులకు పార్టీ అండగా ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి గుంతకల్ మండలం అశ్వర్థయాదవ్, పామిడి మండల అధ్యక్షుడు ప్రతాప్ యాదవ్, వడ్డే హరినాథ్, అంకే గణేష్, గజేంద్ర, రాము యాదవ్, రామగిరి మండలం నుండి కిష్టా, వెంకీ తదితరులు పాల్గొని విజయవంతం చేశారు.

## మోటార్ పంపుసెట్‌ల దొంగలు అరెస్ట్



**బళ్లారి, ఆగస్టు 20, ప్రభాతవార్త**

జిల్లాలోని సిరిగేరి పోలీసులు రైతులు పంట పొలాలకు నీటి సరఫరా కోసం పెట్టుకొన్న పంపుసెట్ మోటార్లను దొంగలించే ముఠాను పట్టుకున్నట్లు, వారిపై కేసు నమోదు చేసి కస్టడీకి పంపినట్లు జిల్లా ఎస్పీ రంజిత్‌కుమార్‌బండారు తెలిపారు. సిరిగేరికి చెందిన జడెప్ప అనే రైతు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన సిరిగేరి పోలీసులు కేసులో నిందితులైన కె.మారుతి, కె.అంజినప్ప, కరిబసవలను సిరిగేరి గ్రామంలోని సిన్మా థియేటర్ వద్ద అరెస్టు చేసి వారి నుంచి ఐదు పంపు సెట్ మోటార్‌లను స్వాధీనపరుచుకున్నట్లు, సుమారు రూ.1,25,000 విలువ ఉంటుందన్నారు. పోలీసుల కార్యాచరణను శ్లాఘించిన జిల్లా ఎస్పీ పోలీసులకు రివార్డులు ప్రకటించారు.

